సాక్షి నిర్మల్
గురువారం : 3 : అక్టోబర్ : 2024

గరిష్టం/కనిష్టం
34.0/24.0
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'గంగమ్మతల్లి'కి రంగులు



విగ్రహానికి రంగులు వేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

భైంసా: బాసర గోదావరి నది తీరంలో ఏర్పాటు చేసిన గంగమ్మతల్లి విగ్రహానికి రంగులు వెలిసిపోవడంతో గత నెల 30న 'గంగమ్మపై పట్టింపేది' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో బుధవారం విగ్రహానికి రంగులు వేయించారు. అంతేకాకుండా విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసాటౌన్: పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో దళిత సంఘాల నాయకులు, పెద్దలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్ చంద్రే, ప్రసంజిత్ ఆగ్రే, కౌన్సిలర్ గౌతం పింగ్లే, రాహుల్ దగ్డే, తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో జూనియర్ సివిల్ జడ్జి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని బుధవారం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలను అందజేసారు. ఈకార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అఖండజ్యోతితో పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న మహారాష్ట్ర వాసులు

బాసర: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఉమర్ఖేడ్ గ్రామానికి చెందిన అవినాష్, శర్మ తమ గ్రామం నుంచి బాసరకు అఖండజ్యోతితో పాదయాత్రగా తరలివచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసర ఆలయ అర్చకులచే అఖండజ్యోతిని వెలిగించుకుని తమ గ్రామానికి పాదయాత్రగా వెళ్లడం కొంత కాలంగా ఆనవాయితీగా వస్తోందని వారు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని, గ్రామస్తులు విద్యాబుద్ధులతో నడుచుకుంటారని ప్రగాఢ నమ్మకమని వారు తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలన

నిర్మల్‌రూరల్: డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్లు పరిశీలించారు. ఇందుకు 15 టీంలను ఏర్పాటు చేశారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ బుధవారం కలిశారు. మంత్రి ఉత్తమ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు.

జీపీలకు కాస్త ఊరట



చించోలి(బి) గ్రామ పంచాయతీ కార్యాలయం

జిల్లా వివరాలు
గ్రామ పంచాయతీలు : 400
మల్టీపర్పస్ వర్కర్స్ : 1624
72 జీపీలకు విడుదలైన ట్రాక్టర్ కిస్తీలు : రూ.12,16,719
సీసీ చార్జీలు : రూ.82,45,000
3000 లోపు జనాభా కలిగిన జీపీలకు నిధులు : రూ.1,84,50,000
8000 లోపు జనాభా కలిగిన జీపీలకు నిధులు : రూ.18,75,000
8000కు పైగా జనాభా కలిగిన జీపీలకు నిధులు : రూ.1,99,076
1,624 మంది మల్టీపర్పస్ వర్కర్స్‌కు : రూ.1,63,48,399

- రూ.4.63 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- స్థానిక అవసరాలకు ఉపయోగించాలని ఆదేశాలు
- ఊపిరి పీల్చుకున్న పంచాయతీ కార్యదర్శులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇన్నాళ్లూ నిధుల లేమితో పల్లెల్లో పాలన పడకేసింది. ట్రాక్టర్ కిస్తీలు, కరెంటు బిల్లులు, పారిశుధ్య కార్మికుల వేతనాల చెల్లింపులు లేక, పనులు సాగక ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా మారుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కాలువల్లో ఉన్న మురుగును ఎత్తిపారేస్తూ.. రోడ్లన్నీ శుభ్రం చేస్తూ.. చెత్తను సేకరిస్తూ.. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. వీటిని దూరం చేయడానికి, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసింది.

రూ.4.63 కోట్ల ఎస్ఎఫ్‌జీ నిధులు..

నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలకు కాస్త ఉపశమనం లభించింది. ట్రాక్టర్ల ఈఎంఐలు, విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలతో పాటు స్వచ్ఛదనం–పచ్చదనం, తదితర కార్యక్రమాలకు వెచ్చించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం రూ.4.63 కోట్ల ఎస్ఎఫ్‌జీ (స్టేట్ ఫైనాన్స్ గ్రాంట్) నిధులను విడుదల చేసింది. పాలకవర్గాల పదవీకాలం పూర్తయినప్పటి నుంచి నిధుల కొరతతో పంచాయతీల్లో పాలన పడకేసింది. జీపీ అవసరాలకు నిధులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న పంచాయతీ కార్యదర్శులు తాజాగా నిధుల మంజూరుతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం మంజూరైన నిధుల్లో నుంచి ట్రాక్టర్ల ఈఎంఐలకు రూ.12.16 లక్షలు, సీసీ చార్జీలు రూ.82.45 లక్షలు, కార్మికుల వేతనాల కోసం రూ.1.63 కోట్లు, స్వచ్ఛదనం–పచ్చదనం కోసం రూ.2.03 కోట్లు వెచ్చించనున్నారు.

కాస్త ఊరట...

జిల్లాలోని 72 గ్రామ పంచాయతీలు ట్రాక్టర్ కిస్తీలు చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు నిధులు రావడంతో ఇబ్బందులు తీరనున్నాయి. మరోవైపు పారిశుధ్య కార్మికులకు సెప్టెంబరు నెలతో మరో రెండు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం వేతనాలకు నిధులు కేటాయించారు. ఎట్టకేలకు ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులు, ఇతర అభివృద్ధి పనులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయడంలో కార్యదర్శులు ఆర్థిక భారం నుంచి బయటపడ్డారు. అసలే వర్షాకాలం.. వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరుతున్నారు.

నిధుల లేమితో ఇక్కట్లు..

ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు సర్పంచులు పాలకవర్గాలకు బాధ్యత వహించారు. పల్లెల్లో ఏపని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునే వారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ.వేలల్లో ఖర్చు చేశారు. మరికొందరు వారి వేతనాలు విడుదల కాగానే అందులో నుంచి వెచ్చించారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకులకు సింగిల్ మోటార్లు అమర్చడం వంటి పనులకు కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నామని, నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు సైతం ఆవేదన చెందుతూ వచ్చారు.

టేకు చెట్లపై గొడ్డలి వేటు



ఈ చిత్రంలో కనిపిస్తున్న అటవీ అధికారి రవికుమార్. నచ్చన్‌ఎల్లాపూర్ సమీపంలో కొద్ది రోజుల క్రితం రోడ్డు పక్కనే స్మగ్లర్లు టేకుచెట్లను కొద్దిమేర నరికి వదిలేశారు. ఆప్రాంతాన్ని ఈ అధికారి సందర్శించి సెల్ఫీ దిగి అధికారులకు పెట్టి వదిలేశారు. ఆతర్వాత రోజే స్మగ్లర్లు రెండు చెట్లను పూర్తిగా నరికి తరలించుకుపోయారు. ఇంత జరిగినా అటవీ అధికారులు స్పందించకపోవడంతో స్మగ్లర్లు ధర్మాజీపేట్ మూలమలుపు వద్ద పది చెట్లను నరికివేశారు. మొదటి ఘటన తర్వాత అటవీ అధికారులు గస్తీ నిర్వహించి ఉంటే.. స్మగ్లర్లు దొరికేవారు. పది టేకు చెట్లను కాపాడేవారు.



ప్రధాన రహదారి పక్కనే నరికిన చెట్టు మొదలు



దుంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన కొమ్మలు

- రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- రోడ్ల వెంట ఉన్న వృక్షాలు నరికివేత
- తరలిపోతున్న కలప
- పట్టించుకోని అధికారులు

కడెం: స్మగ్లర్ల గొడ్డలి వేటుకు కవ్వాల్ అభయారణ్యంలో టేకు చెట్లు నేల కూలుతున్నాయి. ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న చెట్లనే యథేచ్ఛగా నరికి కలప తరలించుకుపోతున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు మాయమవుతున్నా.. అటవీ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అటవీరేంజ్ కార్యాలయానికి సమీపంలో.. రోడ్డు పక్కనే ఉన్న చెట్లను కూడా అటవీ అధికారులు కాపాడకపోవడం చర్చనీయాంశమైంది. అటవీ అధికారుల పర్యవేక్షణ లోపంతో కడెం మండలం పెద్దూర్ నుంచి నచ్చన్‌ఎల్లాపూర్ మధ్యలో ఉన్న నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారికి ఇరువైపులా దాదాపు 13 టేకు చెట్లు స్మగ్లర్ల ధాటికి కనుమరుగయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యం

అటవీ అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరు సిబ్బంది నిర్లక్ష్యంతో అడవుల్లో స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. కడెం మండలం పెద్దూరు నుంచి నచ్చన్ ఎల్లాపూర్ గ్రామం వరకు నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారికి ఇరువైపులా గడిచిన రెండు నెలల వ్యవధిలో 13 భారీ టేకు వృక్షాలను స్మగ్లర్లు తరలించుకుపోయారు. ఇంత జరుగుతున్నా అధికారుల చర్యలు కానరావడం లేదు. చెట్లను నరుకుతున్న స్మగ్లర్లను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా చెట్లు నరికివేతకు గురైన ప్రాంతాన్ని అటవీ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

వనాలను కాపాడాలి

భవిష్యత్ తరాల మనుగడ కోసం వనాలను కాపాడాలి. మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా కలప స్మగ్లర్లపై అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.
– ముక్కెర గంగాధర్, కొండుకూర్

చర్యలు తీసుకుంటాం

చెట్లు నరకడం చట్టరీత్యా నేరం. కలప స్మగ్లర్లపై చర్యలు తీసుకుంటాం. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపైనా చర్యలు తీసుకుంటాం. – శాంతారాం, ఎఫ్‌డీపీటీ

ఇలేగాం ఆదర్శంగా నిలవాలి



రోడ్డు ఊడుస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి అందరికీ ఆదర్శంగా ఇలేగాం గ్రామం నిలవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పిలుపునిచ్చారు. బుధవారం గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులతో, పారిశుధ్య కార్మికులు, మహిళలతో కలిసి ప్రధాన రోడ్లను శుభ్రంచేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఇలేగాం జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకు ద్వారా శుభకార్యాల్లో ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సుదర్శన్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీంరావు, తాలోడ్ శ్రీనివాస్, సాంప్లీ రమేశ్, కాంబ్లే సుభాష్, సుష్మారెడ్డి, వీడీసీ చైర్మన్ కోల రత్నాకర్, ఉపాధ్యక్షులు పెర్తన్‌పెల్లి శంకర్, కోశాధికారి కౌటిక్‌వార్ కృష్ణమూర్తి, సభ్యులు దేవిదాస్‌పటేల్, మాజీ ఎంపీటీసీ ఉప్పు రాజన్న, కార్యదర్శి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం



కిశోర గాంధీయం పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

నిర్మల్‌ఖిల్లా: మహాత్మాగాంధీ సిద్ధాంతం, మార్గం రానున్న యువతరానికి అనుసరణీయమని ప్రముఖ కవి సాహితీవేత్త తిరునగరి సురేశ్వర్ అన్నారు. బుధవారం ప్రియదర్శిని నగర్‌లోని లయన్స్‌క్లబ్ సమావేశ మందిరంలో విశ్రాంత ఎంపీడీవో, కవి చట్ల గజ్జరాం రచించిన 'కిశోర గాంధీయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కౌమార దశలో మహాత్మా గాంధీ తాను అనుసరించిన విధానాలు, సరిదిద్దుకున్న పొరపాట్లను కావ్యం ద్వారా సవివరంగా వర్ణించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు డా.అప్పాల చక్రధారి, డా.దామెర రాములు, యు.కృష్ణంరాజు, తొడిశెట్టి పరమేశ్వర్, ఎం.రాజారావు, నేరెళ్ల హనుమంతు, డా.మురళీధర్, పత్తి శివప్రసాద్, కామవరపు జగదీశ్వర్, అంబటి నారాయణ, పోలీస్ భీమేష్, బొందిడి పురుషోత్తమరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని మంజులపూర్‌లో దుర్గాదేవి విగ్రహాలు



అమ్మ రాకకు వేళాయె..

- నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- కనువిందు చేస్తున్న అమ్మవారి విగ్రహాలు
- ఉట్టిపడుతున్న కళాకారుల నైపుణ్యం
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



నిర్మల్‌టౌన్: దసరా హిందువులకు ఒక ముఖ్యమైన పండగ. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజులు దేవి నవరాత్రులు..పదవరోజు విజయదశమిని కలిపి దసరా అని అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండగ. దసరాను నవరాత్రి, శరన్నవరాత్రి అని కూడా అంటారు. నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయం, హరిహర క్షేత్రం, బంగల్‌పేట్ మహాలక్ష్మి, బాగులవాడ ఆంజనేయస్వామి, తదితర ఆలయాల్లో ఏటా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారు కొలువుదీరే మండపాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలు, వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. అందంగా ముస్తాబు చేశారు.

నిర్మల్‌లో నాలుగు దశాబ్దాలుగా..

నిర్మల్‌లో నాలుగు దశాబ్దాలుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బాగులవాడ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో 1981లో మొదటగా దుర్గామాత చిత్రపటం ఉంచి రెండేళ్లు పూజలు చేశారు. తర్వాత 1983లో రెండు ఫీట్ల కర్ర విగ్రహం, 1985 నుంచి ఇప్పటి వరకు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించారు. బాగుల వాడ కాలనీలో సుమారు 500 కుటుంబాలు చిన్న, పెద్ద తేడా లేకుండా తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు చేస్తారు.

ప్రసిద్ధిగాంచిన నందిగుండం దుర్గామాత

పట్టణంలో 19 ఏళ్ల క్రితం మర్రిచెట్టు వద్ద దుర్గామాత వెలిసింది. భక్తులు అప్పటి నుంచి పూజలు చేస్తున్నారు. 14 ఏళ్లుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆరేళ్లక్రితం రూ.1.80 కోట్లతో ఆలయం నిర్మించారు. పట్టణంలో దాదాపు 40 మండపాల్లో అమ్మవారిని కొలుస్తారు.

వైభవంగా నిర్వహిస్తాం



మర్రిచెట్టు కింద అమ్మవారు స్వయంగా వెలిసింది. అమ్మను కొలిస్తే కష్టాలు తీరుతాయని భక్తుల నమ్మకం. నందిగుండం దుర్గామాత ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం.
– లక్కడి జగన్మోహన్‌రెడ్డి, నందిగుండం దుర్గామాత ఆలయ చైర్మన్

9 రోజులు.. 9 రూపాలు..

- ఈ నెల 3న అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ఈరోజు అమ్మవారికి లేత గులాబీ రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. నైవేద్యంగా క్షీరాన్నం సమర్పించాలి.
- 4న వేదమాత శ్రీ గాయత్రి దేవిగా దర్శనమిస్తారు. నారింజరంగు వస్త్రం సమర్పిస్తారు. అమ్మవారికి ప్రసాదంగా కొబ్బరి అన్నం సమర్పించాలి.
- 5న అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. ఈరోజు లేత పసుపు రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. నైవేద్యంగా గారెలు సమర్పిస్తారు.
- 6న శ్రీ లలిత త్రిపుర సుందరిదేవిగా దర్శనమిస్తారు.

ముదురు బంగారు రంగు వస్త్రం సమర్పిస్తారు. నైవేద్యంగా కదంబం ప్రసాదం నివేదిస్తారు.

- 7న శ్రీ చండీదేవిగా దర్శనమిస్తుంది. ఎర్రని వస్త్రాన్ని సమర్పిస్తారు. నైవేద్యంగా చింతపండు పులిహోర, రవ్వ కేసరి వంటివి సమర్పించాలి.
- 8న శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిస్తారు. ముదురు గులాబీ రంగు వస్త్రాన్ని సమర్పించాలి. నైవేద్యంగా పూర్ణం బూరెలు సమర్పించాలి.
- 9న సరస్వతిదేవి రూపంలో దర్శనమిస్తుంది. తెల్లని వస్త్రం సమర్పిస్తారు. నైవేద్యంగా దద్ధోజనం సమర్పించాలి.
- 10న దుర్గాదేవిగా దర్శనమిస్తారు. ఎర్రని వస్త్రం సమర్పిస్తారు. నైవేద్యంగా నిమ్మకాయ పులిహోర సమర్పించాలి.
- 11న మహిషాసుర మర్దిని దేవి అలంకరణం. ఆకుపచ్చని వస్త్రాన్ని సమర్పించాలి. నైవేద్యంగా చక్కెరపొంగలి సమర్పించాలి.
- 12న రాజరాజేశ్వర దేవి దర్శనమిస్తుంది. అమ్మవారికి ఎరుపు ఆకుపచ్చరంగు వస్త్రాలను సమర్పించాలి. ఈ రోజునే దసరా పండగగా భావిస్తాం.

గాంధీ చూపిన బాటలో నడవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన బాటలో మనమంతా నడవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్వో భుజంగ్ రావ్, ఏవో సూర్యారావ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో...

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకీ షర్మిల గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీ చేసిన సేవలను కొనియాడారు.

ట్రిపుల్‌ఐటీలో..

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో గాంధీజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ మహాత్ముని మార్గంలో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, డా. రాములు, హరికృష్ణ, లక్ష్మణ్, ముత్యం, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ల కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సేషన్ జడ్జి రాధిక, న్యాయవాదులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అహింస మహాత్ముడి ఆయుధం

నిర్మల్‌చైన్‌గేట్: అహింస మహాత్ముడి ఆయుధమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌తో పాటు భాగ్యనగర్ లోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు నందేడపు చిన్ను, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాజీద్ అహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

వదంతులు నమ్మవద్దు

- ఎస్పీ జానకీ షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: సామాజిక మాధ్యమాల్లో వచ్చే లేదా ఇతర వదంతులు ప్రజలు నమ్మవద్దని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. కుబీర్ మండలానికి చెందిన ఓ యువకుడు, అదే మండలానికి చెందిన బాలిక భైంసా పట్టణానికి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ విషయమై స్థానికంగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్పీ వెంటనే భైంసాకు చేరుకుని వివరాలు వెల్లడించారు. కుబీర్ ఘటన విషయమై పూర్తి వివరాలు సేకరించామని, ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అమ్మాయి, అబ్బాయి ఇద్దరు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు గుమిగూడవద్దన్నారు. ఏదైనా ఘటన జరిగితే పోలీసుల దృష్టికి తేవాలని, ఎవరూ చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుని కేసుల పాలు కావద్దని సూచించారు. ఆమె వెంట పట్టణ సీఐ గోపినాథ్ ఉన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు గోదావరిలో పడి వ్యక్తి మృతి

బాసర: గోదావరిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి వ్యక్తి మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ ఒంగోలుకు చెందిన అధారత్ తాపీ మేస్త్రీ కూలీ పని చేసేందుకు బాసరకు వచ్చాడు. అయితే మంగళవారం రాత్రి స్నానం చేస్తుండగా గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి, మృతదేహాన్ని వెలికి తీశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బెల్లంపెల్లి చౌరస్తా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్ మండలంలోని ఇందారానికి చెందిన కొలిపాక రాజన్న (తాపీ మేస్త్రీ) నస్పూర్ మండలం సీతారాంపల్లెకు చెందిన జాడి కవిత(కూలీ) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై భవన నిర్మాణం పనులు చేసేందుకు వెళ్తుండగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. రాజన్నకు తీవ్ర గాయాలు కాగా.. కవిత స్వల్పంగా గాయపడింది. స్థానికులు క్షతగాత్రులను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం వైద్యులు కరీంనగర్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాదాస్పద పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన ఇలియాస్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. తిరుపతి లడ్డు వ్యవహారంపై వాట్సాప్ గ్రూపులో వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని పొనకల్‌కు చెందిన ఎరుకల రమేశ్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఇతర గ్రూపుల్లో వచ్చిన పోస్టును జన్నారం మండలానికి చెందిన ఒక గ్రూపులో పోస్టు చేయడంపై బీజేపీ, విశ్వ హిందు పరిషత్‌కు చెందిన నాయకులు కూడా ఫిర్యాదు చేశారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఓ ప్రకటనలో హెచ్చరించారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాక్స్ వాహనంలో ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అందులో 16 క్వింటాళ్ల బియ్యం ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రవెల్లికి చెందిన గుండవార్‌రాజ్ ప్రకాష్, చింతవార్ సంతోష్, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముండే అంకుష్‌లపై కేసు నమోదు చేశారు. అదే విధంగా పట్టణంలోని ఠాకూర్ హోటల్ వద్ద ఆటోలో నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్‌నగర్‌లో జరిగిన చోరీ

ఇల్లు జాగ్రత్త!

- నగదు, బంగారం బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి
- అనుమానిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు పోలీసుల సూచన



మంచిర్యాలక్రైం: ఈనెల 2 నుంచి ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. రాష్ట్రంలో అత్యంత పెద్ద పండుగ దసరా. దీంతో ప్రజలు సొంత ఇళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్తారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ఇదే అదునుగా భావించి దొంగల ముఠా ఆయా ప్రాంతాల్లో తిష్ట వేసి దొంగతనాలు చేస్తుంటారు. అలాగే మార్కెట్ ఏరియాలో, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో చోరీలకు పాల్పడుతుంటారు. మరికొందరూ మాయమాటలు చెప్పి అవసరానికి సహాయం చేస్తామని నమ్మించి నిలువునా.. దోచుకుంటారు. పగలంతా రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి, దొంగతనాలకు పాల్పడుతారు. అయితే ఊరికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ ప్రజలకు సూచనలు ఇచ్చారు. ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలి. దీంతో ఆయా ప్రాంతంలో పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో రాత్రి 10 దాటిందంటే హోటల్స్, పాన్ షాపులన్ని బందు చేయిస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

దొంగతనాల తీరు..

పగలంతా రెక్కీ నిర్వహించి, రాత్రి తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతారు. పక్కింటి వాళ్లతో మాటలు కలిపి, ఎక్కడి వెళ్లారు, ఎప్పుడు వస్తారని ఆరా తీస్తారు. ఇదే అవకాశం అని భావించి ఇల్లు గుల్లా చేస్తారు. బంగారం, డబ్బు, విలువైన వస్తువులు దోచుకుంటారు. బాధితులు ఇంటికి వచ్చి చూసే సరికి ఏమి మిగలవు. కొంత మంది దొంగలు రద్దీ ప్రాంతాల్లో సంచరిస్తూ.. పర్సులు, బైక్‌లు, బ్యాగ్‌లు ఎత్తుకెళ్తారు.

ఇవి పాటించాలి..

- ఊర్లేవారు పక్కింటి వారికి చెప్పాలి. లేదా ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎన్ని రోజులు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎప్పుడు వస్తారో సమాచారం ఇవ్వాలి.
- ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. దీని నుంచి మీ ఇంట్లో జరిగే విషయాలు వెంటనే సెల్‌ఫోన్‌కు అలర్ట్ రింగ్‌టోన్ వస్తుంది. దీంతో దొంగలను సులువుగా పట్టుకోవచ్చు.
- మార్కెట్‌లో సైరన్ మోగే తాళాలు సైతం అతి తక్కువ ధరలో దొరుకుతాయి. దానిని కదిలించే ప్రయత్నం చేస్తే సైరన్ మోగుతుంది. దీంతో పక్కవారు అలర్టు అయ్యే అవకాశం ఉంది.
- తాళం వేసి అది కనిపించకుండా డోర్ కర్టెయిన్ కప్పిఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంటి ముందు ఉన్న గేటుకు తాళం వేయకపోవడం మంచిది. బెడ్‌రూంలో లైట్ వేసి ఉంచాలి.
- నగదు, బంగారం బ్యాంకుల్లో భద్రత పరుచుకోవాలి.
- అపార్ట్‌మెంట్‌లో అందరు కలిసి వాచ్‌మెన్‌ను పెట్టుకోవాలి. ఆయనపై నిఘా ఉంచాలి.
- మహిళలు బయటకు వెళ్లేముందు విలువైన నగలు ధరించవద్దు.
- గుర్తుతెలియని అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

సమాచారం ఇవ్వాలి



పండుగ సెలవులకు ఊరికి వెళ్లేవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. దీంతో ఆ ప్రాంతంలో ప్రత్యేక నిఘా పెట్టడం జరుగుతుంది. మార్కెట్ ప్రాంతాల్లో మహిళల భద్రత కోసం షీటీం పోలీసులు మఫ్టీలో ఉంటారు. దీంతో పాటు పెట్రోలింగ్ బీట్స్ పెంచాం. బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పోలీసుల నిఘా పెంచాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

జాతీయస్థాయిలో మెరిసిన మనోళ్లు



ద్వితీయ స్థానంలో నిలిచిన రాష్ట్ర జట్టు

ఆదిలాబాద్: 34వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టు ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. జార్ఖండ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో బుధవారం మహారాష్ట్ర జట్టుతో జరిగిన ఫైనల్‌లో తలపడి రన్నరప్‌గా నిలిచింది. ఈ జట్టులో జిల్లాకు చెందిన ఉట్నూర్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు సిడాం శంకర్, కుమ్ర సురేందర్, రాథోడ్ శివ సాయి, ఆత్రం శివ చరణ్, పెందూరు హనుమంతు, ఆత్రం యాదవ్ షావ్ ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. వీరు జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించారని జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. ఐటీడీఏ ఖుష్బూ గుప్తా, డీడీ వసంత్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ఈశ్వర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు రాష్ట్ర జట్టుకు అభినందనలు తెలిపారు.

సొంతింటి పథకం అమలు చేయాలి

శ్రీరాంపూర్: కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (టీఎస్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నస్పూర్– శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో మారు పేర్లతో పని చేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలన్నారు. రీజియన్ల వారీగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. అనేక హామీలు ఇచ్చి గెలిచిన గుర్తింపు సంఘం కార్మికులకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. వారి వైఫల్యం వలన కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇటీవల ఐఎన్టీయూసీకి రాజీనామా చేసిన సమ్ము రాజయ్య ఉద్యోగుల సంఘంలో చేరారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, జైపాల్‌సింగ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గట్టయ్య

అండర్‌-14 జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్‌– 14 జోనల్‌స్థాయి(ఉమ్మడి జిల్లా) క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఈవో రవీందర్ రెడ్డి, హాజరై, పోటీలు ప్రారంభించారు. ఇందులో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల్, నిర్మల్ జట్లు తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో మంచిర్యాల్‌– నిర్మల్ జట్లు తలపడగా, నిర్మల్ జట్టు విజేతగా నిలిచింది. ఈపోటీల్లో ఎంపికైన వారు ఈనెల 7 నుంచి 10 వరకు గద్వాల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ వన్నెల భూమన్న, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎంఈవో శంకర్, పార్థసారథి, భూక్యా రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన నిర్మల్ జట్టు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్: మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను బుధవారం పట్టుకున్నట్లు పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య తెలిపారు. పక్కా సమాచారం మేరకు పెంచికల్‌పేట్– సలుగుపల్లి ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా.. లారీ డ్రైవర్లు గమనించి లారీలను సలుగుపల్లి మార్గం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. సిబ్బందితో కలిసి లారీలను వెంబడించి పట్టుకున్నామన్నారు. స్థానికుల సహాయంతో లారీలను కాగజ్‌నగర్ గోశాలకు తరలించామన్నారు. 149 పశువులు ఉండగా.. అందులో 21 చనిపోయాయి. అక్రమంగా పశువులను తరలిస్తున్న నాలుగు లారీలను సీజ్ చేసి, మహబూబ్‌నగర్‌కు చెందిన ఎండీ షఫీ, మహారాష్ట్రకు చెందిన క్రిష్ణ బాసిరాం పవార్, సోహిద్ షరీఫ్, నదీం షేక్‌తో పాటు మరో ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది కృష్ణమూర్తి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



పట్టుకున్న లారీ డ్రైవర్లతో ఎస్సై

పేకాట రాయుళ్ల అరెస్టు

జైపూర్: జైపూర్ మండలం ఇందారం పరిధిలోని దొరగారిపల్లెలో బుధవారం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి, ఇందారం గ్రామానికి చెందిన లలిత ప్రసాద్, గోదావరిఖనికి చెందిన ఓదెలు, వెంకటేశం, అశోక్, తిరుమలేశ్, శ్రీనివాస్, రామకృష్ణలను ఆదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. వారి వద్ద నుంచి రూ.7,935 నగదు, 5 సెల్ ఫోన్లు, 1ఆటో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

కోటపల్లి: మండలంలోని శంకరపూర్ అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు కోటపల్లి ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో స్పెషల్‌పార్టీ పోలీసులతో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా.. ముగ్గురు పరారైనట్లు తెలిపారు. వారి నుంచి రూ.10,930 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బుధవారం పక్కా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి నుంచి రూ.5,850 నగదుతో పాటు 52 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

బెల్లంపల్లి: వేబిల్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను బుధవారం రాత్రి బెల్లంపల్లిలో మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతం నుంచి వేబిల్లు లేకుండా లారీలల్లో బెల్లంపల్లికి ఇసుక రవాణా అవుతున్నట్లు మంచిర్యాల మైనింగ్ శాఖ అధికారులకు సమాచారం అందింది. మైనింగ్ అధికారులు సురేశ్, రాం నరేశ్ మాటు వేసి బెల్లంపల్లికి ఇసుక లారీలు చేరగానే చాకచక్యంగా పట్టుకున్నారు. ఒకే వేబిల్లుపై మూడు లారీలతో ఇసుక తరలిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇసుకను రైల్వే కాంట్రాక్టు పనుల కోసం తీసుకువచ్చి ఒకచోట డంప్ చేశారు. సదరు లారీలను టూటౌన్ పోలీసులకు మైనింగ్ అధికారులు అప్పగించారు. ఈమేరకు విచారణ చేపట్టినట్లు మైనింగ్ శాఖ ఏడీ తెలిపారు.

13 మంది రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి ఘర్షణకు దిగిన దస్నాపూర్, మహాలక్ష్మివాడకు చెందిన 13 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డీజే డబ్బుల విషయంలో రెండు గ్రూపుల వారు రైల్వేస్టేషన్ వద్ద ఘర్షణకు దిగారు. ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేయడంతో యోగేష్ గ్రూప్‌కు చెందిన ఆరుగురిని, వికాస్ గ్రూప్‌కు చెందిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయ కేసుల్లో పాత నేరస్తుడైన కిన్వట్‌కు చెందిన షేక్ ఈసాను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు బుధవారం తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇతడిపై పలు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. తప్పించుకుంటూ తిరుతున్న నిందితుడు ఆదిలాబాద్ పట్టణంలో గంజాయి విక్రయించేందుకు ఒప్పందం చేసుకోవడానికి రాగా.. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

టిప్పర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీ సమీపంలో సింగరేణి యాజమాన్యం చేపట్టిన రోడ్డు నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్న టిప్పర్ బోల్తా పడటంతో డ్రైవర్ మ హేశ్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. మట్టిని తీసుకుని వెళ్లి రోడ్డు ప నులు చేపడుతున్న ప్రాంతంలో అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో టిప్పర్ ఒకవైపుకు ఒరిగి బోల్తా పడింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌కు గాయలయ్యాయి. హుటాహుటిన బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భైంసాలో చైన్ స్నాచింగ్

- వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగులు బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పూలేనగర్‌కు చెందిన గంగాదేవి రాహుల్‌నగర్ ప్రధాన రోడ్డు మీదుగా నడుచుకుంటూ.. వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు, అడ్రస్ అడిగి మెడలో నుంచి ఐదు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈక్రమంలో ఆమె ప్రతిఘటించగా.. చేతికి గాయాలయ్యాయి. అయితే చోరీ చేసి దుండగులు చోరీ చేసి పారిపోతున్న దృశ్యం స్థానిక సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఈమేరకు బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలో తరచూ చైన్ స్నాచింగ్ ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన 'బాసర'

- నేడు శైలపుత్రి అలంకరణలో అమ్మవారు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలో కొలువైన సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో నేటి నుంచి శారదీయ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం వేకువ జామున శ్రీ జ్ఞాన సరస్వతి, మహాలక్ష్మీ, మహాకాళి అమ్మవార్లకు ఆలయ అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య మంగళ వాయిద్యసేవ, గణపతి పూజ, సుప్రభాత సేవలతో మహాభిషేకం, అలంకరణ, మంగళహారతి, మంత్రపుష్పం, తదితర పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, క్షేత్ర పూజ, స్వస్తి పుణ్యహ వచనము అంకురార్పన, కలశస్థాపన (ఘటస్థాపన) పూజలు ప్రారంభిస్తారు. నేడు శైలపుత్రి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారికి కట్టె పొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు. భక్తులతో పాటు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ కాంతుల్లో అమ్మవారి ఆలయం

బాసరలో ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

బాసరలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం పరిశీలించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్న పనులను పర్యవేక్షించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలైన్, తాగునీటి సౌకర్యం, ఉచిత భోజన వసతి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు



దర్శించుకుంటున్న న్యాయమూర్తులు

బాసర: శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని బుధవారం హైకోర్టు జాయింట్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, సిద్దిపేట ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి కె.సాయి రమాదేవి, భైంసా జడ్జి దేవేంద్ర బాబు దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్ అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వీరి వెంట నిర్మల్ జిల్లా కోర్టు సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక

ఉట్నూర్‌రూరల్: సౌత్‌జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, పీడీ అనిత బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల 29, 30న వరంగల్ జిల్లా కేంద్రంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగిందని, ఇందులో విద్యార్థి కోట్నాక్ సచిత్ అత్యంత ప్రతిభ కనబర్చడంతో సౌత్ జోన్ ఇంటర్ కాలేజీ ఏట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కి ఎంపికయ్యాడన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ సాయిప్రసాద్, నర్సింగ్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌లో నివాసం ఉంటున్న వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. నిర్మల్‌కు చెందిన వివాహిత ఆదిలాబాద్ పట్టణంలో శిక్షణ తీసుకుంటుంది. అయితే మంగళవారం నుంచి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు భరోసా

- ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు చదువు ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలు భరోసా కల్పిస్తున్నాయని ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, ఉట్నూర్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లతో కలిసి ఇంద్రవెల్లి మండలంలోని పాటగూడ సమీపంలో, ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈసందర్భంగా రిబ్బన్ కట్ చేసి పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాయన్నారు. ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దసరా సెలవులు ముగిసిన వెంటనే పిల్లలను బడికి పంపాలన్నారు. కార్యక్రమంలో గురుకులం ఆర్‌సీవో కాంబ్లే అనిల్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ స్వరాప్ యాదవ్, వైస్ ప్రిన్సిపాల్ రేఖరాణి, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



బాలాజీ (ఫైల్)

తానూరు: మండల కేంద్రానికి చెందిన జాదవ్ బాలాజీ (35) అనే యువరైతు అప్పుల బాధ భరించలేక బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. బాలాజీ ఆయనకు ఉన్న ఎకరం భూమితో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని సోయా సాగు చేస్తున్నాడు. గతంలో భారీ వర్షాలు కురవడంతో పంట ఎదుగుదల తగ్గిపోయి, దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పెట్టుబడుల కోసం చేసిన రూ. 5 లక్షల అప్పులు ఎలా తీర్చాలి అనే బెంగతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జాదవ్ రూపా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో దూకి వృద్ధుడు..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన ఒలపు ముత్యం(60) అనే వృద్ధుడు తాగుడుకు బానిసై గోవింద్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యం గత రెండేళ్లుగా తాగుడుకు బానిసై కుటుంబసభ్యులతో రోజు గొడవ పడేవాడు. మంగళవారం భార్య నాగవ్వతో డబ్బులు ఇవ్వాలని గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కోసం సాయంత్రం వరకు వెతికిన అచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గోవింద్ చెరువులో మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య నాగవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి..

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఇట్టెం రాములు(49) అతడి భార్య, తల్లి గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి తన కొడుకుల బాగోగులు చూసుకునేందుకు ఎవరూ లేరని మానసికంగా కుంగిపోయేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కొడుకు ఇట్టెం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.